

వర్ని మండలం వకీల్‌ఫారంలో నేలకొరిగిన వరి పంట

## గాలివాన బీభత్సం

**నేలవాలిన వరి పైర్లు ఆందోళనలో రైతాంగం**

నమస్తే యంత్రాంగం, అక్టోబర్ 4: చెడగొట్టు వాన రైతులను ఆగం జేసింది. చేతికొచ్చిన పంటలను దెబ్బతీసింది. నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. బలమైన గాలులు కూడా తోడు కావడంతో చేతికొచ్చిన వరి పంట దెబ్బతిన్నది. దీంతో రైతాంగం దిగాలు చెందుతున్నది. బోధన్ మండలంలోని అమ్దాపూర్, ఊటపల్లి, రాజీవ్‌నగర్ తండా శివారులో కురిసిన భారీ వర్షానికి వరి పైర్లు దెబ్బతిన్నాయి. రెంజల్ మండలంలో 2 సెం.మీటర్లకు పైగా వర్షం కురియడంతో వరి నేలకొరిగింది. చందూర్, రుద్రూర్ మండలాల్లోనూ పంటలకు నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో కూడిన వర్షంతో కోతకు సిద్ధంగా ఉన్న పంట నేలవాలిందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో నీళ్లు నిలిచాయని, నేలవాలిన పైర్లతో ధాన్యం గింజలు దెబ్బతింటాయని వాపోతున్నారు. సిరికొండ మండలంలో ఈదురుగాలులు వీయడంతో న్యావనంది, రావుట్ల, నర్సింగ్‌పల్లి, సిరికొండ, చిన్నవాల్గోట్ గ్రామాల్లో వడ్లు రాలిపోయాయి. దెబ్బతిన్న పంట పొలాలను శుక్రవారం పరిశీలించిన ఏవో నర్సయ్య.. ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తామన్నారు.



బెల్లాల్ శివారులో నేలకొరిగిన వరి పంటను చూపుతున్న రైతులు



పంట కోతలు.. కాంటాలు పక్కపక్కనే..
వర్ని మండలంలో ఓవైపు వరి కోస్తుండగా, ఇటువైపు సంచుల్లో ధాన్యాన్ని తరలిస్తున్న వ్యాపారులు

- తక్కువ ధరకే కొంటున్న దళారులు
- వానలకు భయపడి అమ్ముకుంటున్న రైతులు
- మద్దతు ధర లేదు.. రూ.500 బోనస్ రాదు
- రెండు విధాలుగా నష్టపోతున్న రైతులు
- బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో అన్నదాతల పరిస్థితి

## ప్రారంభమైన కోతలు
# జాడలేని కేంద్రాలు

**పంట కోతలు** ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాల జాడ కరువైంది. సన్నవడ్లకు బోనస్ వస్తుందని ఆశపడ్డ రైతాంగానికి నిరాశే మిగిలింది. రాష్ట్రంలో బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లోనే ముందుగా వరి కోతలు ప్రారంభమవుతాయి. సెప్టెంబర్ చివరి నాటికే ధాన్యం రాశులు చేతికొస్తాయి. ప్రస్తుతం వరి కోతలు జోరందుకోగా, కొనుగోలు కేంద్రాలు పత్తా లేకుండా పోయాయి. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాల ముప్పు నేపథ్యంలో దళారులకు అమ్ముకుంటున్నారు. గ్రామాల్లో వాలిపోతున్న రైస్‌మిల్లర్లు అన్నదాతల పరిస్థితిని అవకాశంగా తీసుకుని ధర తెగ్గోస్తున్నారు. మార్కెట్‌లో సన్నరకాలకు మంచి రేటు పలుకుతున్నా.. కనీస మద్దతు ధర కూడా ఇవ్వకుండా తక్కువ ధరకే ధాన్యం తరలించుకు పోతున్నారు. వర్షాల ముప్పు ఉందని భయపెడుతూ పచ్చి వడ్లను సైతం వదలకుండా తీసుకెళ్తున్నారు. ఇటు గిట్టుబాటు ధర రాక, అటు ప్రభుత్వం ఇస్తామన్న రూ.500 బోనస్ దక్కక రైతులు రెండు విధాలుగా నష్టపోవాల్సి వస్తున్నది.

–నిజామాబాద్, అక్టోబర్ 4
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

### పల్లెల్లో వాలిపోతున్న ప్రైవేటు వ్యాపారులు

**నిజామాబాద్** జిల్లాలో 1,46,895 హెక్టార్లలో సన్నరకం, 25,149 హెక్టార్లలో దొడ్డు రకం వడ్లను సాగు చేశారు. వానాకాలంలో నీటి లభ్యత, వాతావరణ పరిస్థితుల మేరకు హెక్టారుకు సన్నవడ్లు అయితే 6.84మెట్రిక్ టన్నులు, దొడ్డు రకమైతే 7.52 మెట్రిక్ టన్నులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 11,94,154 మెట్రిక్ టన్నులు ధాన్యం వస్తుందని లెక్కగట్టింది. ఇందులో సన్న వడ్లే (10.49 లక్షల మెట్రిక్ టన్నులు) సింహభాగం కాగా, దొడ్డురకం వడ్లు 1.89 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఉంటుందని అంచనా. స్థానిక అవసరాలకు 1.94లక్షల మెట్రిక్ టన్నులు మిగతా ధాన్యం బహిరంగ మార్కెట్‌కు వచ్చే అవకాశాలున్నాయి. 1.85లక్షల మెట్రిక్ టన్నులను ప్రైవేటు వ్యాపారు లు సేకరించే అవకాశాలుండగా, మిగిలిన 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం 480 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పీఏసీఎస్ ద్వారా 388, ఐకేపీ 52, డీసీఎంఎస్ 29, మెప్మా 6, కేపీపీఎస్ఎస్ ఆధ్వర్యంలో 5 కేంద్రాలు నెలకొల్పనున్నారు. ధాన్యం సేకరణపై సీఎం రేవంత్ రెడ్డి రెండ్రోజుల క్రితమే స్వయంగా సమీక్షించి పలు సూచనలు చేశారు. రైతుకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. కానీ, నిజామాబాద్‌లో పంట చేతికొచ్చినా యంత్రాంగం మాత్రం కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యాన్ని వీడడం లేదు.

### ప్రైవేటు వ్యాపారుల దోపిడీ..

రైతుల నుంచి ఇష్టపూర్వకంగా ధాన్యాన్ని సేకరించే అవకాశం రైస్ మిల్లర్లకు ఉంది. కానీ కనీస మద్దతు ధర కంటే తక్కువగా కొనుగోలు చేయడం కుదరదు. రైతును ముంచి లాభాలు ఆర్జించేందుకు కొంత మంది చిల్లర ఎత్తుగడలకు తెర లేపారు. రైస్ మిల్లర్ల సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహించే ఓ వర్గం వ్యక్తులు నేరుగా రంగంలోకి దిగి రైతుల నుంచి పచ్చి వడ్లను సైతం తీసేసుకుంటున్నారు. తద్వారా రైతులకు రూ.500 బోనస్ రాకుండా పోతున్నది. ఓ వైపు ఎమ్మెస్పీ లభించక, మరోవైపు బోనస్ లేక అన్నదాతలు రెండువిధాలుగా నష్టపోతున్నారు. మరోవైపు, ప్రైవేటు వ్యాపారులపై నిఘా కరువైంది. అధికార పార్టీ నేతల పేరు చెప్పుకుంటూ క్షేత్ర స్థాయిలో హల్‌చల్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం బాన్సువాడ, బోధన్, జుక్కల్ నియోజకవర్గాల్లో కోతలు జోరందుకుంటున్న వేళ ప్రభుత్వం దళారులకు ముకుతాడు వేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

వర్నిలో వరి కోస్తున్న హార్వెస్టర్లు



## దసరా కానుకగా డబుల్ ఇండ్లు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, కలెక్టర్

- త్వరలోనే అర్హుల ఎంపిక
- ధరణి దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం
- దేశానికి ఆదర్శంగా నూతన ఆర్‌వోఆర్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- జిల్లా అభివృద్ధిపై కోమటి రెడ్డి, సురేఖతో కలిసి సమీక్ష


కంఠేశ్వర్, అక్టోబర్ 4: పేదలకు దసరా కానుకగా త్వరలోనే డబుల్ బెడ్రూం ఇండ్లను అందించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇండ్లలో సౌకర్యాలు కల్పించి, అర్హులైన వారికి త్వరలోనే అందించనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లాకు వచ్చిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖతో పొంగులేటి కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల తీరుపై ఆరా తీశారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారం, డబుల్ బెడ్రూం ఇండ్లు, ఎల్‌ఆర్‌ఎస్, విద్య, వైద్యారోగ్య శాఖల పనితీరు, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే తదితర అంశాలపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఈ సందర్భంగా మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. అంశాలవారీగా సమీక్షించిన మంత్రి పొంగులేటి.. అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్రూం ఇండ్లను విజయదశమి కానుకగా పేదలకు అందించాలని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షణలో అర్హులైన వారిని ఎంపిక చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇండ్ల నిర్మాణ ప్రగతిపై పంచాయతీరాజ్ ఈఈ సరిగా సమాధానం చెప్పక పోవడంతో మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి విడుతగా త్వరలోనే ప్రతి నియోజకవర్గానికి 4 వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్లు పొంగులేటి చెప్పారు.

దేశానికే ఆదర్శంగా నిలిచేలా నెలాఖరులోపు నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. విద్య, వైద్య శాఖల్లో సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, కబ్జాలకు పాల్పడిన వారు ఏ స్థాయిలో ఉన్నా వదలొద్దని స్పష్టం చేశారు. వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి, వ్యక్తికి ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డిజిటల్ కార్డులను తీసుకొస్తున్నట్లు చెప్పారు. వీటి ద్వారానే ప్రభుత్వ పథకాలను అందించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, వివిధ సంస్థల చైర్మన్లు అనిల్ ఈరవత్రి, తాహెర్, సీపీ కల్మేశ్వర్ సింగేనవార్, అధికారులు పాల్గొన్నారు.

## అంతా 'హస్త'వ్యస్తం

ఖలీల్‌వాడి, అక్టోబర్ 4: కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నిజామాబాద్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఏకంగా ఆరుగురు మంత్రులు పాల్గొన్న ఈ కార్యక్రమం మొత్తం గందరగోళంగా సాగింది. జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ పీసీసీ హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా పార్టీ శ్రేణులు భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. నగరమంతా కటౌట్లు కట్టి, తెగ హడావుడి చేశాయి. ఏకంగా కేబినెట్‌లో మూడొంతుల మందిమంత్రులు ఇందూరుకు తరలివచ్చారు. అయితే, ఊహించిన స్థాయిలో జనాలు రాకపోవడంతో పార్టీ నేతలు కంగుతిన్నారు. వచ్చిన వారు సైతం మహేశ్‌కుమార్ మాట్లాడే సమయానికే వెళ్లిపోవడంతో కుర్చీలన్నీ ఖాళీగా కనబడ్డాయి.



జనం లేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

### పోలీసుపై జులుం..



పోలీసుపై దాడి చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్త

కాంగ్రెస్ సభ వద్ద ఓ నాయకుడు రెచ్చిపోయాడు. కానిస్టేబుల్‌పై జులుం ప్రదర్శించాడు. వేదికపై వెళ్లేందుకు యత్నించగా, అక్కడే ఉన్న స్పెషల్ పార్టీ పోలీసు అరవింద్ అడ్డుకున్నాడు. వేదిక పైకి అనుమతి లేదని చెప్పగా ఆగ్రహంతో ఊగిపోయిన కాంగ్రెస్ నాయకుడు పోలీసు కాలర్ పట్టుకుని లాగాడు. దీంతో షర్టు గుండీలు తెగిపోయాయి. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకోగా, సదరు నేత చెంప చెళ్లుమనిపించడంతో ఒక్కసారిగా సభలో గందరగోళం నెలకొంది. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు సదరు కాంగ్రెస్ నాయకుడిపై కేసు నమోదైంది.

## నెలలోపు అట్రాసిటీ కేసుల పరిష్కారం

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

కంఠేశ్వర్, అక్టోబర్ 4: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. అట్రాసిటీ కేసుల పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిజామాబాద్ కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులు, కుల సంఘాల నేతలతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల కేసులను నెలలోపు పరిష్కరించేలా చొరవ చూపాలని, అవసరమైతే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో వీడీసీలు ఆధిపత్యం కొనసాగించకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని, ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. అణగారిన ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వీడీసీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా చివరి వారంలో సివిల్ రైట్స్ డే, మూడు నెలలకోసారి అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ చక్కగా పని చేస్తున్నారని ప్రశంసించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, నీలాదేవి, శంకర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వెంకటయ్య

## పర్యావరణ పరిరక్షణ కోసమే ఎలక్ట్రికల్ బస్సులు

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఖలీల్‌వాడి, అక్టోబర్ 4: పర్యావరణాన్ని కాపాడేందుకు ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులను తీసుకొచ్చినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నిజామాబాద్ బస్టాండ్‌లో ఎలక్ట్రికల్ బస్సులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఎలక్ట్రికల్ బస్సులను నిజామాబాద్–జేబీఎస్, బాన్సువాడ–నిజామాబాద్ మధ్య నడుపనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, భూపతిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నగర మేయర్ దండు నీతూకిరణ్, అడిషనల్ కలెక్టర్ అంకిత్, డీటీసీ దుర్గాప్రమీల, రీజినల్ మేనేజర్ జానిరెడ్డి పాల్గొన్నారు.